(17వ పేజీ తరువాయి)

భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వేళ్ళూనింది.

ఈ సంవత్సరంలో కమ్యూనిస్టు దేశాలలో వీస్తున్న ప్రచండమైన ప్రజాస్వామ్య పవనాలను పరికిస్తే, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల నెహ్రూ ప్రగాఢ విశ్వాసం ఎంత సరైనదో అర్థమౌతుంది.

నెహ్రూ అంతర్జాతీయ వాది. జాతి, మత, కుల, వర్ణ, వర్గ విభేదాలకు అతీతుడైన మానవతావాది. ఆయనను "న్యూ స్టేట్స్‌మన్ అండ్ ది వరల్డ్" అనే అమెరికన్ పత్రిక "మానవోత్తముడు, అహింసా వీరుడు" అని పేర్కొన్నది.

వివిధ మతాలు, విభిన్న కులాలు వున్న భారత దేశానికి నెహ్రూ ప్రసాదించిన మరొక సిద్ధాంతం — సెక్యులరిజం. అందువల్లనే, మనది మతాతీతమైన లౌకిక రాజ్యాంగం. రాజకీయవేత్తలు, రాజకీయపక్షాలు మతాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని ఎంతగానో ప్రయత్నిస్తున్న ఈ రోజులలో కనీసం ప్రజలైనా సెక్యులరిజం సిద్ధాంతాన్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నించడం అవసరం.

కాగా, బ్రిటిష్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ భారతీయ జాతీయ నాయకులను ఎంతగానో ద్వేషించేవాడు. స్వాతంత్ర్యోద్యమం సాగుతుండగా ఒకసారి మహాత్మాగాంధిని వైస్రాయి తనతో చర్చలకు ఢిల్లీలోని తన భవనానికి ఆహ్వానించగా, అప్పటిలో బ్రిటిష్ ప్రధాని అయిన విన్‌స్టన్ చర్చిల్ "ఆ దిగంబర సన్యాసిని (నేక్డ్ ఫకీర్) రాజప్రాసాదం ఎందుకు తొక్కనిచ్చారని వైస్రాయిపై చిందులు త్రొక్కాడు!

అలాంటి చర్చిల్ ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నెహ్రూను ఉద్దేశించి —

"అసూయను, భయాన్ని, ద్వేషాన్ని నిర్జించిన మహనీయు"డని జోహార్లు అర్పించాడు.

కేవలం స్వతంత్ర భారత తొలి ప్రధాని కావడమే నెహ్రూ ఘనత కాదు. అది ఘనత కానే కాదు. అంతకు మించిన ఘనత ఆయనది. స్వాతంత్ర్యోద్యమంలో చేరి వుండకపోతే, ఆయన ఇంగ్లీషు సాహిత్యంలో మరెంతగానో పేరుప్రఖ్యాతులు సంపాదించేవాడు.

అయినా, ఆయన రచించిన "డిస్కవరీ ఆఫ్ ఇండియా", "ఆత్మకథ", "గ్లింప్సెస్ ఆఫ్ ది వరల్డ్ హిస్టరీ" మొదలైనవి ఇంగ్లీషు సాహిత్యంలో మణిపూసల వంటివి.

ఆయన 18 సంవత్సరాల పరిపాలనలో అనేక లోపాలు, పొరపాట్లు జరిగివుండవచ్చు. నిజానికి, "ఆధునిక పరిపాలనాదక్షునికి" వుండవలసిన లక్షణాలేమీ ఆయన వద్ద లేవు!

కాని, ఆయన వంటి రాజనీతిజ్ఞుడు, భావుకుడు, మానవతావాది, స్వాతంత్ర్య యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, విశిష్ట, విలక్షణ గుణ సంపన్నుడు ఎప్పుడో కాని జన్మించడు.

ఆయన వ్యక్తిత్వంలోని ఉత్తమ గుణగణాలు, ఆయన ఆశయాలు భారత దేశానికి ఎన్నటికీ మహోన్నతమైనవే; ఆదరణీయమైనవే; అనుసరణీయమైనవే.

ఇదే ఆ మహాపురుషునికి శతజయంతి నివాళి!

## తాసీల్దారుగారి బంగళా.



బంగళాలో వెనక వైపు దొడ్లో బ్రహ్మాండమైన పూల తోట. తోట మధ్య, తరాలుగా యెదిగి ఎన్నెన్ని పకులకో జీవనాధారంగా నిలుస్తూ, తన ఛత్రచ్ఛాయల కింద కాలక్షేపం చెయ్యదలుచుకున్న ప్రతివాడికీ - వాడి మంచీ చెడుతో ప్రమేయం లేకుండా - చల్లటి నీడ ననవరతం ప్రసాదిస్తున్న వటవృక్షం. ఎంత మంది పిల్లలాడుకున్నారో, అక్కడ! తన నీడలో కార్యకలాపాలెన్ని జరిగాయో! - తనకే జ్ఞాపకం లేదు...

కానీ-

మొన్న మొన్ననే జరిగిన తాసీల్దారుగారబ్బాయి తాలూకు వివాహ మహోత్సవపు విందు మాత్రం మరచిపోలేదు. ఆ తాగుడు పార్టీలో లక్షలు ఖర్చయినై! పగిలిన షాంపేన్ బాటిళ్ళ ముక్కలింకా గుచ్చుకుంటుంటే సహించలేక భూగర్భంలోకి చొచ్చుకుపోయి దాక్కున్నట్టున్నాయి వటవృక్షపు వేళ్ళు! ఇంట్లో జరిగే తంతంతా దశాబ్దాలుగా కళ్ళారా పరికించిందీ వృక్షం! తాసీల్దారుగారి తాతగారు, మనవడి వుపనయనం చేస్తూ వెయ్యికిపైగా బీదవాళ్ళకు కడుపునిండా భోజనం పెట్టినవాడు తానెంతో మురిసిపోయింది! సాయంత్రమయ్యేప్పటికి సన్నాయివాళ్ళు తియ్యగా మంగళవాద్యం వాయిస్తుంటే పెరటి గోడ కిటికీ పక్కన లాంఛనంగా వుంచిన దేవుడి మంటపం ముందు నటువుగా యత్రీమంత్రం వల్లిస్తుంటే, గోధూళి సమయానికి పూలన్నీ హర్షిత వదనారవిందాలతో తనను గిలిగింతలు పెట్టే చిన్నారి పకులతో సరస సల్లాపాలాడుతుంటే తన కళ్ళకు పండుగైంది!

మరి... ఈమధ్య కథ మారింది.

తాసీల్దారుగారి హయామొచ్చినప్పటి నుంచీ కన్నీళ్ళే! కన్నీళ్ళు తన వారసత్వమైనట్టు బాధ!!

ఎందుకంటారా??

దేవుడి మంటపం పక్కన కిటికీలో కూచుని, ఎన్నిసార్లు పనివాళ్ళు శుభ్రం చేసినా, వాళ్ళచేతికందకుండా కిటికీ చువ్వల్లోంచి ఇంట్లో జరిగే తతంగమంతా చూస్తున్న ఆ రెండు నాపరాళ్ళ ముక్కలనూ అడగండి!

రోజూ ఆ రాళ్ళ సంభాషణ ఇలా-

"ఈ కాలం మనిషి గుండెలను మనతో పోలుస్తారు కవులు! ఎంత అన్యాయం! మనకన్నా కర్కశంగా మానవులు తయారయ్యారన్న కించిత్తు ఇంగితజ్ఞానం వాళ్ళకుండక్కర్లా?"

రెండో రాయి జవాబిస్తుంది-

"రాతి గుండెలు ... రాతి గుండెలని - రాస్తూపోవడం అలవాటులే. కానీ... ఈ కాలపు బ్రతుకుల్లో, కనీసం మన రాళ్ళకున్న నిజాయతీ కూడా మనుషులకు లేదని - ఆ సన్నాసుల కేం తెలుసు గనక! కమ్మటి సంగీతం వినరాక వినరాక మన చెవిన బడితే - మనమే అస్తిత్వాన్ని మరిచిపోయి కరిగిపోతాం! మరి ఈ కాలపు మనుషులా!!- సొంత తల్లినీ, కడుపున పుట్టిన బిడ్డల్నీ పిట్టల్లా కాల్చి పారేస్తూనే, కొంచెమైనా పాపభీతి లేకుండా, మనుషుల్లాగే చలామణీ అవుతున్నారు చూడు మరి!!"



# రాళ్ళు

ఏల్చూరి విజయ రాఘవరావు

"పోనీ మనకెందుకులే ఈ రాద్ధాంతమంతా ... ఇంతకీ వారం - రెండు వారాల నుంచీ, నీ వాలకం చూస్తున్నా. కిటికీలోంచి మహోమహా తొంగిచూస్తున్నావ్!! ఏమిటి సంగతి?"

"నీకు తెలీనట్టు నాటక మాడకు. ఈ ఇంట్లో రోజూ జరిగే "రామాయణం" చూడకుండా కళ్ళు మూసుకుని ఎందాకా కూర్చుంటాం మరి?"

"ఆ కథేనా! - నిన్న దొడ్లో మర్రి చెట్టు మామతో పూసగుచ్చినట్టు చెబుతున్నావ్?"

"నువ్వు చూశావుగా-ఈ తాసీల్దారుగారబ్బాయి తంతూ! - వాడికి దయ్యాలు పట్టి పీకుతున్నాయేమో! పెళ్ళై పట్టుమని పది రోజులైనా కాలా ... రోజుకో కొత్త అమ్మాయిని వెంటేసుకొచ్చి, తల్లీ పెళ్ళాం ముందరే తందనాలాడుతున్నాడు!! ఛీ !! లంచాలు తింటూ రాత్రింబవళ్ళూ భ్రష్ట జీవిత పద్మవ్యూహంలో మునిగి తేలుతున్న తాసీల్దారు గారికీ సంగతే పట్టదు! తల్లి చెప్పి చెప్పి తల పగలకొట్టుకున్నా అబ్బాయి వినడు! పాపం! ఎంత నెమ్మదస్తురాలో కొత్తగా కాపురానికొచ్చిన ఆ సాధ్వి!- భరిస్తూ భరిస్తూ పెదిమకదపలే దీనాటివరకూ!"

మొదటి రాయంటుంది దిగులుగా-

"అందుకే - ఆ అబ్బాయిది రాతిగుండె అని వర్ణిస్తారేమో కవులుగాని, అల్లాంటి నీచుణ్ణి మనతో పోలిస్తే నాకూ వొళ్ళు మండుకొస్తూనే వుంది..."

రెండో రాయి-

"నిన్న రాత్రి జరిగిన దారుణం వటవృక్షం మామతో వర్ణిస్తూ వర్ణిస్తూనే తెల్లారింది... ఇవ్వాళ పూర్తిచేస్తా... ఎటూ ఆ పోలీసుల గొడవ తగ్గితే గదా..."

"నిన్న కాస్త వానొచ్చి, కమ్మటి నిద్రలో కన్ను మూత పడింది నాకు. పూర్తిగా గమనించలా - అసలేం జరిగిందేమిటి?"

"ఆ అబ్బాయి ఫుల్‌గా తాగొచ్చాడు! ఇంట్లో రభసంతా మామూలేగా ... నిన్న కొంచెం కొత్త గొడవ! వరదలొచ్చి పంటలు సరిగ్గా పండక కొంప మునిగిన రైతు రామలింగం తాసీల్దారుగారి కాళ్ళ మీద పడి ప్రాధేయపడ్డాడు నిన్న మధ్యాహ్నం- పూర్తి పన్నుకట్టే తాహతు లేదనీ, క్షమించి మరి ఆ రాక్షసుడు - వాళ్ళబ్బాయ్ - ఏం "జబర్దస్తీ ఘోటాలా" చేశాడో మరి - రామలింగానికి పెళ్ళి గావాల్సిన పిల్ల వుంది కదా-ఆ పడుచుని వెంటేసుకొచ్చాడు రాత్రి! వెయ్యి విధాల తల్లి నచ్చ చెప్పింది... వినక... ఇక భరించలేక కొత్త పెళ్ళి కూతురు కూడా వాడి కాళ్ళమీదపడి ఇలా చెయ్యొద్దనీ, ఇంత అన్యాయం తను భరించలేననీ మొక్కుకుంది. తీరని కట్నదాహం అదివరకే వీడి నరాల్లో చిచ్చు పెట్టిందేమో ఒక్క పరుగున వెళ్ళి కారు లోంచి పెట్రోల్ తెచ్చి ఆ అమ్మాయిపై నిలువునా పోశాడు!! నే నే నివ్వెరపోయి చూస్తూనే వున్నా. ఇంకేముంది-తల్లీ, పెళ్ళాం కేకలు పెడుతూ పారి పోతున్నకొద్దీ యింకా యింకా రెచ్చిపోతూ, తాళి బొట్టు పచ్చలారని పెళ్ళాం చీరకి అగ్గిపుల్ల ముట్టించి, చేతిలో రివాల్వర్ ఝుళిపిస్తూ రామ లింగం కూతుర్ని రెక్కబట్టి లాక్కుంటూ ఎటో మాయమయ్యాడా భ్రష్టుడు!"

వింటూన్న రెండోరాయి గుండెలు మంచులా కరిగాయి.

ఇంతలో సుడిగాలి ముంచుకొచ్చింది! చూస్తుండగానే ఉరుములూ, మెరుపులూ... కుంభ వృష్టితో భయంకరమైన తుపానులా మారింది... వటవృక్షం కొమ్మలన్నీ విరుగుతూ, తలోదారీ ఎగిరి పోవడం మొదలెట్టాయి! ...రంగు రంగుల పూలన్నీ రాలి మురికి నీళ్ళల్లో పడిపారిపోతున్నాయి!

బీభత్సం!

ఒక్కసారిగా అణుబాంబులా కొట్టిన హోరు గాలికి ఆకులూ, అలమూ, చెత్తా చెదారమూ పుంఖాను పుంఖాలుగా విజృంభిస్తుంటే, కిటికీ లోంచి నాపరాళ్ళు రెండూ ఎగిరి చెరో పక్కకు మురికి కాలవలో పడ్డాయి.

మొదటి రాయి ఏడుస్తూ అంటూంది-

"అక్కా! దిగులు పడకు. మానవత్వం లేని యీ దానవుల కొంపలో జరిగే అత్యాచారాలు చూస్తూ భగవంతుడింకా ఎన్నాళ్ళూరుకుంటాడు? మళ్ళీ మరో జన్మంటూ వుండి, కలవక కలవక మనం కలుస్తే, మనిషి "మనిషి"గా బతికేవాడి ఇంటిలోనే కాపురం చేద్దాం. వెళ్ళొస్తా"

"అవునే చెల్లీ... అప్పుడీ మాయదారి కవులకు గూడా బుద్ధి చెబుదాం- మనలాంటి రాతిగుండె లీకాలపు మనిషి గుండెలంత నీచమూ, కర్కశమూ కాదని..."

రోదసి రోదిస్తున్న మూలుగు... ఉరుములూ, మెరుపులూ మళ్ళీ మళ్ళీ గర్జిస్తూ, వెలుగుతూ, అలిసి సమసిపోయాయి. బెదిరిన పక్షుల కలకల మాటుమణిగిపోయింది.

వటవృక్షం కింద మారణ నిశ్శబ్దం!!

తాసిల్దారు కోడలు శవం కాలికాలి, గుర్తు పట్ట లేకుండా నల్లగా చీకట్లో కలిసి పోయింది.

దూరంగా చెరో కాలవలో, రెండు నాపరాళ్ళు దిగ్భ్రమతో - నోరులేని శవాల్లా - మబ్బుల్లోకి గుడ్లు గుచ్చుకుని - మన్నుతిన్న పాముల్లా పడుకున్నాయి ... నిలువునా కుంగినా, "రాబోయే రామరాజ్యానికి" నిరీక్షిస్తూనే వుంది వటవృక్షం!!